
సాక్షి
గుంటూరు
మంగళవారం । 7 । జనవరి । 2025



దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

కారెంపూడి: దివ్యాంగుల పింఛన్ల పరిశీలనా బృందం సోమవారం తనిఖీలు చేసింది. మండలంలో 41 మంది ఇళ్లకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సేకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 567.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.



హరినామ సంకీర్తన గానం

తెనాలి: శ్రీరుక్మిణి సమేత గోవర్ధన స్వామి దేవాలయం, శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం శ్రీహరినామ సంకీర్తన బృందంచే సంకీర్తనగానం జరిగింది.


బీమా దమనీయం

- ఉచిత బీమాకు బాబు సర్కార్ మంగళం
- ప్రీమియం చెల్లించాలని నిబంధన
- మాకొద్దంటున్న రైతులు
- గడువు పొడిగించినా స్పందన కరువు

కొరిటిపాడు(గుంటూరు): రైతులపై పైసా భారం పడకూడదన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు మంగళం పాడింది. ప్రీమియం రైతులే చెల్లించాలన్న నిబంధన విధించింది. దీంతో కర్షకులు ఈ బీమా మాకొద్దు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.

రబీలో ఐదు పంటలకే బీమా !

పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. ఈ రబీలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, శనగ పంటలకు బీమా వర్తింపజేశారు. ఇందులో జొన్న, పెసర, మినుము, శనగ పంటలకు రైతులు తమ వాటా కింద హెక్టారుకు 0.25 శాతం, మొక్కజొన్నకు 0.30 శాతం మేర ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. హెక్టారుకు జొన్న రైతులు రూ.140, మొక్కజొన్న రైతులు రూ.119, పెసర రైతులు రూ.285, మినుము రైతులు రూ.113, శనగ రైతులు రూ.125 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సిందేనని నిబంధన విధించారు. ఈ ఐదు పంటలకు ప్రీమియం చెల్లింపు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారు. అయితే 683 మంది మాత్రమే బీమా పథకాల్లో చేరడంతో డిసెంబర్ నెలాఖరు వరకు గడువు పొడిగించారు. అయినా ఈ 15 రోజుల్లో మరో 1,156 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించడం గమనార్హం. మొత్తంగా 29,756 హెక్టార్లకు ప్రీమియం చెల్లిస్తారని అధికారికంగా అంచనా వేయగా.. చివరకు 1,849.32 హెక్టార్లకు మాత్రమే ప్రీమియం చెల్లించినట్లు చెబుతున్నారు. అంటే చాలా మంది రైతులు పంటల బీమా పథకాల్లో చేరడానికి, ప్రీమియం కట్టడానికి ఆసక్తి కనపరచలేదు. 1,839 మంది రైతులు, 1,849.32 హెక్టార్లకు కట్టిన ప్రీమియం రూ.3.59 లక్షలుగా ఉంది.



పంటల వారీగా హెక్టారుకు చెల్లించాల్సిన ప్రీమియం ఇలా..

పంట	ప్రీమియం (రూపాయల్లో)
జొన్న	140
మొక్కజొన్న	119
పెసర	285
మినుము	113
శనగ	125

జిల్లాలో బీమా వర్తించే పంటల రబీ విస్తీర్ణం, ప్రీమియం చెల్లించిన రైతులు ఇలా..

పంటల సాగు	:	29,756 హెక్టార్లు
బీమా ప్రీమియం చెల్లింపు	:	1,849.32 హెక్టార్లు
రైతులపై మోపిన భారం	:	రూ.3.59 లక్షలు..

వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ఇలా..

79,469 ఉచిత పంటల బీమా ద్వారా లబ్ధి పొందిన రైతులు

రూ.68.47 కోట్లు నష్ట పరిహారంగా పొందిన మొత్తం

గత ఐదేళ్లూ నిశ్చింతగా..

గత ఐదేళ్లూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్, రబీలో ఉచితంగా వాతావరణ, ఫసల్ బీమా పథకాలు అమలు చేసింది. రైతులపై పైసా కూడా భారం లేకుండా పరిహారం అందజేసింది. ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుంటే చాలు పథకాలు దరిచేర్చింది. నిబంధనల మేరకు బీమా ద్వారా ఏటా జూన్, జూలైలోనే పరిహారం కూడా జమ చేశారు. గత ప్రభుత్వ హయాంలో తొలిసారిగా ఉద్యాన పంటల రైతులకు కూడా పెద్ద మొత్తంలో పరిహారం ఇచ్చారు. గత ఐదేళ్లూ విస్తారంగా వర్షాలు కురిశాయి. పంట దిగుబడులు కూడా బాగానే వచ్చాయి. ఉచిత పంటల బీమా పథకాల ద్వారా గుంటూరు జిల్లాలో 79,469 మంది రైతులకు ఏకంగా రూ.68.47 కోట్ల నష్టపరిహారం అందించారు.

ఇదెక్కడి న్యాయం?



ఏడు ఎకరాల్లో మొక్కజొన్న, పెసర పంటలు సాగు చేశా. ఇప్పటికే పంటలు పండక, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతున్నాం. ఇలాంటి తరుణంలోనూ బీమా ప్రీమియం భారం మోపడం తగదు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. ప్రస్తుతం రైతులతో కట్టిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు.

– టి.వెంకటస్వామిరెడ్డి, రైతు, గుంటూరు

నమ్మకం లేక కట్టలేదు



నాకు నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం పప్పుశనగ పంట సాగు చేశా. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులే బీమా ప్రీమియం చెల్లించుకోవాలని చెబుతున్నారు. ప్రీమియం చెల్లించినా బీమా వర్తిస్తుందన్న నమ్మకం లేదు. అందుకే ప్రీమియం డబ్బు కట్టలేదు. గత ఐదేళ్లూ రైతుల ఇంటి వద్దకే అన్ని పథకాలు అందాయి.

– కె.వెంకటేశ్వరరావు, రైతు, గుంటూరు

కర్షకుల కన్నెర్ర..

కూటమి ప్రభుత్వం తమ కష్టాలను పట్టించుకోకుండా బీమా ప్రీమియం భారం మోపడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబును నమ్మి దారణంగా మోసపోయామని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్, రబీలలో ప్రీమియం రూపంలో జిల్లా రైతులపై ఏటా రూ.10 కోట్ల వరకు భారం పడనుందని అంచనా వేస్తున్నారు. గత ఐదేళ్లూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉచిత పంటల బీమా అమలు చేయడంతో చీకూచింతలేకుండా పోయిందని గుర్తు చేసుకుంటున్నారు.

అతివలదే అగ్రభాగం

- జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,96,356
- పురుషులు 8,66,871, స్త్రీలు 9,27,601

గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్–2025 తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,96,356 ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 8,66,871, స్త్రీలు 9,27,601 ఉన్నారని పేర్కొన్నారు. సర్వీస్ ఓటర్లు 1,723, ట్రాన్స్‌జెండర్స్ 161 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ తర్వాత 1920 ఉన్నాయని చెప్పారు. ఓటర్ల ప్రక్రియ నిరంతర ప్రక్రియన్నారు. అర్హులైన ఓటర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదులో తప్పులు దొర్లినట్లు భావిస్తే సవరణ చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిన వెంటనే సవరణ ప్రక్రియ చేపడతామన్నారు. ఎస్ఎస్ఆర్–2025 తుది జాబితా డిజిటల్ ప్రింట్ కాపీలను పెన్ డ్రైవ్‌లను, ప్రింట్‌లను ప్రజాప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ అంజనా సిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి ఆమె 11 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులనందించారు.

న్యూస్‌రీల్

న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు



నగరంపాలెం: న్యాయమూర్తులు మధ్యవర్తిత్వంపై నైపుణ్యాన్ని పెంపొందించుకుని సుప్రీంకోర్టుకు అనుగుణంగా మధ్యవర్తిత్వంలో భాగస్వాములు కావాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటి నుంచి హాజరైన అడ్వకేట్ ప్రమీల ఆచార్య (రాజస్థాన్), అడ్వకేట్ వి.పి.తంకచన్ (కేరళ) అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటి (న్యూఢిల్లీ) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వం నలభై గంటల శిక్షణా తరగతులు జిల్లా పోలీస్ కార్యాయల ఆవరణలోని హాల్‌లో ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందాక న్యాయమూర్తులు మధ్యవర్తులుగా ప్రత్యేక పాత్ర పోషిస్తారని వక్తలు అన్నారు. శిక్షణా కార్యక్రమంలో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని సివిల్ జడ్జిలు (జూనియర్, సీనియర్ డివిజన్), జిల్లా జడ్జిలు, అధికారులు పాల్గొన్నారు.

159 మంది మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు అర్హత



నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం జరిగాయి. 331 మంది మహిళా అభ్యర్థులు హాజరవ్వగా, 43 మంది సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కాకపోవడంతో వెనుదిరిగారు. మిగతా 288 మందికి శరీర కొలత పరీక్షలు నిర్వహించగా, అందులో 14 మంది బరువు, ఎత్తు కొలతలు సరిలేకపోవడంతో తిరస్కరించారు. మిగతా 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా, 105 మంది అర్హతను కోల్పోగా, 169 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు చేపట్టగా 21 మంది అర్హత సాధించగా, 148 మంది అర్హత సాధించలేకపోయారు. 169 మందికి లాంగ్ జంప్ పోటీలు జరగ్గా, 159 మంది అర్హత సాధించగా 10 మంది అనర్హత పొందారు. 288 మంది మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 159 మంది అర్హత సాధించగా, మరో 129 మంది అర్హత కోల్పోయారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీలు (క్రైం) కె.సుప్రజ, ఎ.హనుమంతు (ఏఆర్) పర్యవేక్షించారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



రవికాంత్

పట్నంబజారు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో స్పెషల్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు 103, తెనాలికి 11, మంగళగిరి 12, పొన్నూరు 17 బస్సు సర్వీసులను ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు నడుపుతారని, 15 నుంచి 19 వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 9 నుంచి 13 వరకు బెంగళూరు నుంచి మూడు, చెన్నై నుంచి ఆరు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు.

ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ సోమవారం తెలిపారు. కాచిగూడ–శ్రీకాకుళం రోడ్డు (07615) మధ్య ప్రత్యేక రైలును ఈనెల 11, 15 తేదీలలో నడపనున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–కాచిగూడ(07616) మధ్య ఈనెల 12, 16 తేదీలలో ప్రత్యేక రైలును నడపనున్నట్లు పేర్కొన్నారు. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్డు(07617) మధ్య ఈనెల 8న, శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07618) మధ్య ఈనెల 9న ప్రత్యేక రైళ్లు నడుస్తాయని డీసీఎం వివరించారు.

దారి తప్పిన సాయం!

- అవినీతి బయటపడుతుందనే కౌన్సిల్‌ను బహిష్కరించారా?
- బుడమేరు వరద పేరుతో నిధుల దుర్వినియోగం
- కౌన్సిల్‌కు తెలియకుండానే ఆగమేఘాలపై బిల్లుల చెల్లింపు
- నాలుగు నెలలు దాటినా కౌన్సిల్ ముందుకు రాకుండా దాచిపెట్టిన వైనం
- డెప్యూటీ మేయర్ ప్రశ్నతో వెలుగులోకి వచ్చిన అంశం
- విజిలెన్స్ విచారణ కోరుతున్న వైఎస్సార్ సీపీ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మేయర్, డెప్యూటీ మేయర్



కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న మేయర్ కావటి మనోహరనాయుడు, డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: విజయవాడ బుడమేరు వరదల సమయంలో గుంటూరు నగరపాలక సంస్థ చేపట్టిన సహాయక చర్యల నిధులు దారి తప్పాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ మంత్రి ఆదేశాల మేరకు గుంటూరు మున్సిపల్ కమిషనర్ రూ.9 కోట్ల 22 లక్షల నిధులను ఖర్చు చేసి ఫుడ్‌ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు, పాల ప్యాకెట్లు వరద ప్రాంతాలకు పంపారు. ఈ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురాలేదు. వాస్తవానికి నగరపాలక సంస్థ కమిషనర్‌కు రూ.10 లక్షల వరకే సొంతంగా ఖర్చు చేయడానికి అధికారం ఉంది. స్టాండింగ్ కమిటీ అనుమతితో రూ.50 లక్షల వరకూ ఖర్చు చేయొచ్చు. అంతకు మించి రూపాయి ఖర్చు చేయాలన్నా కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసైనా ఆమోదం తీసుకోవాలి. కానీ కమిషనర్ ఆ పని చేయలేదు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలు, కేంద్ర సహాయ మంత్రికీ సమాచారం ఇవ్వలేదు. కనీసం ఇన్ని లక్షల ప్యాకెట్ల ఫుడ్‌ను తయారు చేసి పంపుతున్నామన్న సమాచారం మీడియాకూ ఇవ్వలేదు. అంతా రహస్యంగా చేశారు. గుంటూరులో తయారు చేసిన ఫుడ్ ప్యాకెట్లు ఎక్కడికి సరఫరా చేశారు? ఎక్కడ పంపిణీ చేశారన్న సమాచారమూ అసలు లేదు. నాలుగు రోజుల్లో 17,00,964 ఫుడ్ ప్యాకెట్లు(బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ కలిపి), 3,31,800 వాటర్ బాటిళ్లు, రెండు లక్షల పది వేల బిస్కెట్ ప్యాకెట్లు, 3180 బ్రెడ్ ప్యాకెట్లు, 13,68,992 పాలప్యాకెట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఫుడ్ ప్యాకెట్ల సరఫరాకు కేవలం 8 వేల సంచులు వాడినట్లు చెబుతున్నారు. అంటే ఒక్కో సంచిలో సగటున 212 ఫుడ్‌ప్యాకెట్లు పంపినట్టు. ఇదెలా సాధ్యం? బిస్కెట్, బ్రెడ్ ప్యాకెట్లు ఎలా పంపారో తెలియదు.

అన్నీ కాకిలెక్కలే!

అధికారుల లెక్కలన్నీ కాకిలెక్కలేనని, వీటిపై చర్చ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయన్న డెప్యూటీ మేయర్ ప్రశ్నతో భయం పుట్టిన మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు కౌన్సిల్‌ను బహిష్కరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ చెల్లించిన బిల్లులకు జీఎస్టీ ఉందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. కొటేషన్లు కూడా తీసుకోకుండా బిల్లులు చెల్లించేసినట్లు సమాచారం.

అధికారుల ఖాతాల్లోకి నిధులు!

అధికారుల ఖాతాల్లోకి నిధుల మళ్లింపుపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. ఓ ఈఈ పేరుతో రూ.కోటి, మరొక ఈఈ పేరుతో రూ.50 లక్షలు చెల్లించారు. మరో ఏఈ ఖాతాలోకి నేరుగా బిల్లులు చెల్లించారు. ఇలా అధికారుల ఖాతాలలోకి నిధులు ఎలా జమ చేస్తారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మిని మేయర్ మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, కార్పొరేటర్లు సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపితే పెద్ద కుంభకోణం బయటపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సామర్థ్యానికి మించి సంగం పాలప్యాకెట్లు సరఫరా

వరదల నాలుగు రోజుల్లో సంగం డెయిరీ నుంచి 13,58,992 పాలప్యాకెట్లు పంపారు. అంటే సగటున రోజుకు 3.40 లక్షల పాల ప్యాకెట్లను సంగం నుంచి సరఫరా చేశారు. రోజుకు లక్షా 15 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న సంగం తన సామర్థ్యాన్ని మించి ఎలా సరఫరా చేసింది? అంత మొత్తం విజయవాడకే తరలిస్తే మిగిలిన ప్రాంతాలలో పాల సరఫరాకు ఆటంకం ఎందుకు రాలేదు? అని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

ఫ్యాక్షనిస్టులా కమిషనర్ వ్యవహార శైలి

మేయర్ కావటి మనోహర్‌నాయుడు ధ్వజం


గుంటూరు వెస్ట్: గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఫ్యాక్షనిస్టులా, రాజకీయ నాయకుడిలా వ్యవహరించడం దారుణమని మేయర్ కావటి మనోహర్‌నాయుడు ధ్వజమెత్తారు. సోమవారం మేయర్‌తోపాటు, డెప్యూటీ మేమర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), కార్పొరేటర్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కలిశారు. కమిషనర్ వ్యవహారశైలిపై ఫిర్యాదుచేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఈనెల 4న జరిగిన కౌన్సిల్ సమావేశంలో దూకుడుగా వ్యవహరించిన కమిషనర్ ఆ తరువాత కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తన వద్ద ఉన్న సిబ్బందిని, అటెండర్లను, కార్యాలయ సిబ్బందిని కనీస సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారని విమర్శించారు.

వరద సాయంపై పూర్తి విచారణ చేపట్టాలి

డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు మాట్లాడుతూ విజయవాడ వరద ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం నగర పాలక సంస్థ ఖర్చుచేసిన నిధులపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మేయర్, డెప్యూటీ మేయర్లకు కేటాయించిన సిబ్బందిని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కమిషనర్ తొలగించడం సరికాదని పేర్కొన్నారు.

కోవిడ్ తరహా 'క్రిమి'నల్

- పొంచిఉన్న మరో మహమ్మారి ముప్పు
- దేశంలోనూ హెచ్ఎంపీవీ వైరస్ కేసులు
- కరోనా మాదిరిగా ఊపిరితిత్తులపై ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



గుంటూరు మెడికల్: కోవిడ్ తరహా మరో మహమ్మారి ముప్పు పొంచి ఉందా? ఊపిరి తీసే వైరస్ దేశంలోకి ప్రవేశించిందా? తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదా? ఈ ప్రశ్నలన్నింటికీ ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానం ఇస్తున్నాయి. చైనాను వణికిస్తున్న హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్(హెచ్ఎంపీవీ) వైరస్ కేసులు మన దేశంలోనూ పలు రాష్ట్రాల్లో నమోదు కావడంతో అందరూ అప్రమత్తం కావాల్సిన పరిస్థితి నెలకొంది. బెంగళూరులో ఇద్దరు చిన్నారులకు హెచ్ఎంపీవీ వైరస్ సోకినట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సోమవారం మధ్యాహ్నం వెల్లడించింది. ఆ తర్వాత సాయంత్రానికి గుజరాత్, చెన్నై, కోల్‌కతా తదితర ప్రాంతాల్లోనూ కేసులు వెలుగు చూడడంతో దేశవ్యాప్తంగా అధికారులు అప్రమత్తం అయ్యారు. కోవిడ్ వైరస్ చాపకిందనీరులా వ్యాపించి ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపి మరణ మృదంగం మోగించిన భయానక పరిస్థితులు ప్రజల మది నుంచి ఇంకా చెరిగిపోక ముందే మరో వైరస్ పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఆందోళన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

లక్షణాలు ఒకేలా ఉన్నాయి

కరోనా, హెచ్ఎంపీవీ లక్షణాలు ఒకే విధంగా కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొత్త వైరస్ తీవ్ర శ్వాసకోశ సమస్యలకు దారి తీస్తుందని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై పెనుప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. హెచ్ఎంపీవీ తుమ్ములు, దగ్గుతో వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని చెబుతున్నారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి, శ్వాస సమస్యలు ఉంటే వెంటనే చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెబుతున్నారు. తరచూ చేతులు పరిశుభ్రం చేసుకోవాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని పేర్కొంటున్నారు.

చేయాల్సిన పనులు

- దగ్గినా, తుమ్మినా ముఖానికి చేతిరుమాలు అడ్డుపెట్టుకోవాలి
- బహిరంగ ప్రదేశాల్లో దగ్గినా, తుమ్మినా వచ్చినప్పుడు కళ్లెను ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేయరాదు.
- చేతులను తరచుగా సబ్బుతో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి
- భౌతిక దూరం పాటించాలి
- సరిపడా నీటిని తాగాలి, రోజుకు కనీసం మూడు నుంచి ఐదు లీటర్ల నీటిని తాగడం మంచిది
- ఎనిమిది గంటల సంపూర్ణ నిద్ర అవసరం

చేయకూడని పనులు

- కరచాలనం చేయకూడదు
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి
- కళ్లు, ముక్కు, నోరు చేతులతో రుద్దుకోకూడదు
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయకూడదు
- వైద్యుల సలహాలు లేకుండా సొంతంగా మాత్రలు వేసుకోవద్దు

అప్రమత్తత అవసరం



హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అందరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలి. బయటకు వస్తే తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళ్లరాదు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ, గుంటూరు జిల్లా

దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు ఇబ్బంది



హెచ్ఎంపీవీ నార్మల్ ఫ్లూ మాదిరిగానే ఉంది. పదేళ్లలోపు చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు ఎక్కువగా ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆస్తమా, కిడ్నీ వ్యాధులు, షుగర్, బీపీ, గుండె జబ్బులు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించడం, తగినంత నీటిని తీసుకోవడం ఉత్తమం.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,400** గరిష్ఠం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,800**

వృద్ధులు, దివ్యాంగులపై దయ అవసరం

- ఎక్కువ సేపు వేచి ఉండేలా చేయొద్దు
- అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచన



భాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ

గుంటూరు వెస్ట్: అర్జీలను ఇచ్చేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులను ఎక్కువసేపు నిరీక్షించనీయవద్దని, వారి పనులు త్వరగా చేసి పంపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అదే విధంగా అర్జీల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు పదే పదే తిప్పుకోవద్దని తెలిపారు. వారితో మర్యాదగా మాట్లాడాలని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. ఈ మధ్య కాలంలో కలెక్టర్ వికలాంగుల అర్జీలను శంకరన్ హాలు ఆవరణలోకి వచ్చి స్వయంగా స్వీకరిస్తున్నారు. చిన్నచిన్న సమస్యలకు కలెక్టరేట్‌కు రావద్దని ప్రజలకు హితవుపలికారు. స్థానికంగా ఉండే డివిజనల్, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం వచ్చిన 183 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వెంటనే విడుదల చేయాలి



రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తోపాటు వసతి దీవెన డబ్బులు తక్షణం విడుదల చేయాలి. ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ముఖ్యంగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైంది.

– ఎస్ఎస్‌యూఐ, విద్యార్థి విభాగం నాయకులు

అంగన్‌వాడీలపై వేధింపులు తగవు



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీలపై వేధింపులు అధికమయ్యాయి. వీటిని నివారించాలి. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో జీతాలు పెంచాలని ధర్నా చేసినప్పుడు తాము అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని కుప్పంలో చంద్రబాబు నాయుడు స్వయంగా హామీ ఇచ్చారు. ఇప్పటికీ జీతాలు పెంచలేదు. వెంటనే హామీని నిలబెట్టుకోవాలి.

– అంగన్‌వాడీ కార్యకర్తలు

కూటమి సర్కారుపై గర్జించిన విద్యార్థి లోకం

- విద్యా పథకాల బకాయిలు చెల్లించాలని డిమాండ్
- తెనాలిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన



సబ్‌కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలి: డిగ్రీ, ఇంజనీరింగ్ ,పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల ద్వారా రావాల్సిన రూ.3580 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థిలోకం గర్జించింది. పట్టణంలో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించింది. స్థానిక శివాజీచౌక్ నుంచి ఆరంభమైన ప్రదర్శనలో పెద్దసంఖ్యలో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ జెండాలను చేతపట్టి పాల్గొన్నారు. ఎన్నికల ముందు కూటమి పార్టీల నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ ధర్నా చేశారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నానుద్దేశించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు పాశం వెంకటేష్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న రూ.9.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు రావాల్సి ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ఏటా విద్యార్థులకు నాలుగు విడతలుగా డబ్బులు జమయ్యేవని పేర్కొన్నారు. కూటమి సర్కారు అధికారం చేపట్టాక అసలు విడుదల కాలేదని విమర్శించారు. నిధులు ఇవ్వకపోవడంతో కోర్సులు అయిపోయినా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు వేధిస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కూడా వచ్చేనెలలో డిగ్రీ, ఇంజినీరింగ్ పరీక్షలు జరుగుతాయని, గతంలో పెండింగ్లో ఉన్న డబ్బులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని యాజమాన్యాలు కరాఖండీగా చెబుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో, ఎన్నికల ప్రచారంలో భాగంగా మేనిఫెస్టోలో తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలుచేస్తామని నిర్ణయించటం సమంజసం కాదన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శివ మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలున్న విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని, సర్టిఫికెట్లు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి చెన్నూరి సాయి, ఉపాధ్యక్షుడు భూమేష్, కోశాధికారి పవన్, యశ్వంత్, దుర్గ, దినేష్, శశి, కోటి, పవన్ కుమార్, ఉమేష్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యం
కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: కుష్ఠు వ్యాధి రహిత జిల్లానే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జిల్లా అధికారులతో కలిసి కుష్ఠు వ్యాధిపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పటితో పోల్చుకుంటే ఈ వ్యాధి విస్తరణ బాగా తగ్గిందన్నారు. వ్యాధికి మందులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకు జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గత ఏడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో 48 కేసులను గుర్తించామని పేర్కొన్నారు. ఈసారి మొత్తం 1177 బృందాలను ఏర్పాటు చేసి కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించే కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. బృందాల్లో 658 ఏఎన్ఎంలు, పురుష వలంటీర్లు ఉంటారని పేర్కొన్నారు.

రెండు గ్రావెల్ లారీల పట్టివేత

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్, జిల్లా మైనింగ్ శాఖ జాయింట్ ఆపరేషన్‌ను రెండురోజులుగా నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను మంగళగిరిలో పట్టుకున్నారు. ఈ గ్రావెల్ విలువను అంచనా వేసి కేసు నమోదు చేసి భారీ జరిమానాలు విధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సమాచారం.

7,8,10 తేదీల్లో విద్యుత్ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ

తాడికొండ: ఈ నెల 7,8,10 తేదీలలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి, ఏపీసీపీడీసీఎల్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీ సీఆర్డీయే సర్కిల్ ఎస్ఈ పట్నం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సర్కిల్ కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. సీఆర్డీయే సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని వెల్లడించారు.

ఆశ చూపి రూ.కోట్లు కొల్లగొట్టారు

- పెట్టుబడుల పేర్లతో మోసం చేశారు
- తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశాలోనూ బాధితులు
- సుమారు రూ.30 కోట్లకుపైగా స్వాహా చేశారని ఆరోపణ
- గుంటూరులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సంధ్యా శివపార్వతి, షేక్.హుస్సేన్‌లాల్, క్రాంతికుమార్ దంపతులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పెట్టుబడుల పేర్లతో డబ్బులు ఆశ చూపి రూ.కోట్లు కాజేసి మోసగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద నుంచి సుమారుగా రూ.ఐదారు కోట్లకుపైగా లాగేసుకుని ముఖం చాటేశారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెదనందిపాడుకు చెందిన సంధ్యా శివపార్వతి, షేక్.హుస్సేన్‌లాల్, కాకినాడ జిల్లా జగ్గంపేట వాసి బి.క్రాంతికుమార్ దంపతులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. శివపార్వతి మాట్లాడుతూ ''మూడేళ్ల క్రితం రాజేంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో పరిచయమై గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులో ఉంటున్న ఒకరిని పరిచయం చేసింది. ఆ వ్యక్తికి రూ.లక్ష చెల్లిస్తే, నెలకు రూ.9 వేలు చొప్పున 20 నెలల్లో రూ.1,80 లక్షలు చెల్లిస్తామని చెప్పింది. 20 మందితో గ్రూప్ చేసి లక్కీడ్రా తీసి విజేతకు రూ.90 వేలు చెల్లిస్తామని నమ్మబలికింది. దీంతో గతేడాది జూన్‌లో రూ.లక్ష ఫోన్‌పే చేశా. ఆ తర్వాత రూ.4 లక్షలు చెల్లిస్తే 80 రోజులకు ఒకసారి రూ.2.80 లక్షలు చొప్పున ఐదుసార్లుగా చెల్లిస్తామని ఆశ చూపడంతో రాజేంద్రనగర్‌కు చెందిన మహిళ సమక్షంలో రూ.8 లక్షలు చెల్లించా. మరోసారి రూ.కోటి చెల్లిస్తే కారు, 100 గ్రాముల బంగారం, కంపెనీలో ఉద్యోగమిచ్చి, నెలకు రూ.2 లక్షల జీతమని నమ్మబలికితే డ్వాక్రా మహిళలు, రోజు కూలీలు, ఆటో డ్రైవర్స్, స్నేహితులతో కలిసి మరోసారి మహిళ సమక్షంలో రూ.67 లక్షలు చెల్లించా. వారాంతపు చెల్లింపులని ఆశ పెడితే మరో రూ.2 లక్షలు చెల్లించాను. తర్వాత వెంచర్ ప్రారంభించామని క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఉందని చెబితే రూ.20 లక్షలు చెల్లించా. ఫిక్స్‌డ్ డిపాజిట్లు పదినెలల్లో రెండింతలవుతాయని చెబితే మరో రూ.10 లక్షలు చెల్లించాను. మరో కంపెనీ పేరుతోనూ ఒత్తిడి చేసి మరికొంత నగదు తీసుకున్నారు. 2023 నుంచి 2024 ఫిబ్రవరి వరకు రూ.1.5 కోట్లు చెల్లించాను. అని ఆవేదన వ్యక్తం చేశారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ రూ.12 లక్షలు చెల్లిస్తే రూ.36 లక్షలు, రూ.6 లక్షలకు రూ.18 లక్షలు చెల్లిస్తామని తనను మోసంగించారని వాపోయారు. దాదాపు 2 వేల మంది నుంచి సుమారు 30 కోట్లకుపైగా వసూలు చేశారని బాధితులు చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశాలోనూ వీరి బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

మోసపోయాం న్యాయం చేయండి

- పోలీస్ గ్రీవెన్స్‌లో బాధితుల మొర
- ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సతీష్‌కుమార్



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఎక్కువ అర్జీలు వ్యక్తులు, కంపెనీల చేతుల్లో మోసపోయామని, న్యాయం చేయాలని వచ్చినవే. ఎస్పీ మాట్లాడుతూ వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీలు జనార్దనరావు, రమేష్, మురళీకృష్ణ అర్జీలు స్వీకరించారు.

పది నెలలు చేయించుకుని..

వ్యవసాయ కూలి పనులకెళ్తాను.. తెలిసిన బంధువు ద్వారా మరో వ్యక్తి పరిచయమయ్యారు. ఆ వ్యక్తి తాడేపల్లి పంచాయితీరాజ్ శాఖలో ఉద్యోగి. ఔట్‌సోర్సింగ్‌లో అటెండర్ ఉద్యోగాలు ఉన్నాయని, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి గతేడాది ఫిబ్రవరిలో రూ.2 లక్షలు తీసుకున్నాడు. నెలకు రూ.15 వేలు చెల్లిస్తారని నమ్మబలికాడు. నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. గట్టిగా అడగ్గా తాడేపల్లిలోని కార్యాలయంలో అటెండర్‌గా పని చేయించాడు. పది నెలలు చేసినా జీతం చెల్లించ లేదు. అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడు.

– ఎం.శ్రీనివాస్, చుండూరు

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 148 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 200 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 50 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు వదిలారు.

ప్రైవేట్ ఆపరేటర్లకు పోటీగా బీఎస్ఎన్ఎల్ సర్వీస్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు

నెహ్రూనగర్: ప్రైవేట్ ఆపరేటర్లకు పోటీగా బీఎస్ఎన్ఎల్ సర్వీస్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. సోమవారం చంద్రమౌళినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సచివాయాలకు, స్కూళ్లకు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్టివిటీ ఇవ్వాలని సూచించారు. ప్రైవేట్ ఆపరేటర్లకు దీటుగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను పెంచుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 4జీ టవర్స్ త్వరితగతిన పూర్తి చేయాలని, సెల్‌ఫోన్ సిగ్నల్స్ అన్ని ప్రాంతాల్లో కవరేజ్ ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ జీఎం ఎస్ శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ ఉద్యోగుల కృషి వల్లే ఏఎన్‌యూకు ప్రత్యేక గుర్తింపు

- లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు ఇబ్బందులు లేకుండా చూస్తాం
- పెన్షనర్ల సమావేశంలో వీసీ ఆచార్య గంగాధరరావు వెల్లడి



వర్సిటీ పూర్వ ఉద్యోగులతో వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ(గుంటూరు ఈస్ట్): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు లభించిందంటే దాని వెనుక ఎంతోమంది పూర్వ ఉద్యోగులు, అధ్యాపకులు చేసిన కృషి ఎంతో ఉందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో పెన్షనర్లుగా ఉన్న అధ్యాపకులు, ఉద్యోగులు సోమవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఆచార్య జడ్.విష్ణువర్ధన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ గంగాధర రావు మాట్లాడుతూ మరో రెండేళ్లలో 50 వసంతాలు పూర్తిచేసుకోనున్న వర్సిటీకి పూర్వ ఉద్యోగుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకులు, ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు ఇకపై యూనివర్సిటీకి రావాల్సిన అవసరం లేకుండా చూస్తామని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ వంటి శాఖల్లో సమర్పించే విధానాన్ని అమలు చేయాలని సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు, అధ్యాపకులకు రావాల్సిన బకాయిలను త్వరలోనే చెల్లిస్తామన్నారు. వర్సిటీకి ప్రభుత్వం అందించే బ్లాక్ గ్రాంట్‌తోపాటు అంతర్గత నిధుల సమీకరణ ద్వారా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు చెల్లిస్తున్నట్లు వివరించారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ జి. సింహాచలం మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో గతం కంటే మెరుగ్గా స్పందిస్తున్నట్టు చెప్పారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.శివప్రసాదరావు గౌరవ అధ్యక్షుడు వాసా మాణిక్యాలరావు కూడా మాట్లాడారు. ఇంకా సమావేశంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య రామ్మూర్తి నాయుడు, అసోసియేషన్ కోశాధికారి ఒ.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం. శాంతి శ్రీ, జాయింట్ సెక్రటరీలు బి.పుల్లారావు, ఆచార్య కేఎస్. తిలక్, కార్యవర్గ సభ్యులు, పూర్వ రిజిస్ట్రార్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం 75, 80, 85 సంవత్సరాల వయసు నిండిన పూర్వ ఉద్యోగులను వర్సిటీ అధికారులు అసోసియేషన్ తరఫున సన్మానించారు.

టీడీపీ నేతల మైనింగ్‌ను ప్రశ్నించిన
క్వారీ సొసైటీ సభ్యుల అరెస్టు!

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న అక్రమ మైనింగ్‌ను ప్రశ్నించడంతోపాటు ఫిర్యాదు చేసిన క్వారీ సొసైటీ సభ్యులపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. నెల రోజులుగా తాడికొండ మండలం లాం గ్రామంలో టీడీపీ నాయకులు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దీనిపై జిల్లా విజిలెన్స్, మైనింగ్, కలెక్టర్, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులకు క్వారీ సొసైటీ సభ్యులు వరుస ఫిర్యాదులు చేయడంపై ఆగ్రహించిన టీడీపీ నాయకులు సొసైటీ మాజీ అధ్యక్షుడు షేక్ ఆదిల్, సభ్యుడు షేక్ దావల్‌పై అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయించారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించి తమను పోలీసులు వేధిస్తున్నారని పిటిషన్ వేశారు. పిటిషన్ సోమవారం విచారణకు వస్తున్న నేపథ్యంలో ఆగ్రహించిన పోలీసులు తెల్లవారు జామున ఇంటిలో నిద్రిస్తున్న ఆదిల్, దావల్‌ను అక్రమంగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి విచారణ పేరుతో డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్ళి సాయంత్రం వరకు కూర్చోబెట్టారు. అనంతరం అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం రాత్రి సమయంలో జీజీహెచ్‌కు తరలించారు. సోమవారం రాత్రికి కోర్టులో హాజరు పరుస్తారా? లేక అదుపులో ఉంచుకుని మంగళవారం హాజరుపరుస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

- ఏపీ శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు
- ప్రారంభమైన విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు



గుంటూరు రూరల్: రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే విజ్ఞాన్ స్రవంతి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు 2025ను విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ప్రారంభించారు. మొదటిరోజు కార్యక్రమాల్లో భాగంగా కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడాంశాలతో పాటు నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. శాప్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.7 కోట్ల ప్రోత్సాహకంతోపాటు గ్రూప్–1 ఉద్యోగాన్ని ఇస్తున్నట్టు వెల్లడించారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ శాతాన్ని పెంచినట్టు చెప్పారు. జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన అమరావతి స్పోర్ట్స్ క్యాపిటల్‌ను తీసుకురావాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ప్రతి స్కూల్‌కి క్రీడా మైదానం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ, నిరుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై చాకుతో దాడి

మంగళగిరి: నగదు బ్యాగ్‌తో వెళ్తున్న వృద్ధుడిపై ఇద్దరు ఆగంతకులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటన నగర పరిధిలోని ఆత్మకూరులో జరిగింది. ఆత్మకూరుకు చెందిన బత్తిన వెంకటేశ్వర్లు (55) నగదు బ్యాగ్ చేతిలో పట్టుకుని నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు యువకులు దాడికి పాల్పడ్డారు. వృద్ధుడి నుంచి నగదు బ్యాగు లాక్కొనేందుకు యత్నించారు. ఆయన గొంతులో చాకుతో పొడిచి పరారయ్యారు. వెంటనే గమనించిన స్థానికులు వెంకటేశ్వర్లును ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు ఎల్బీ నగర్‌లోని నగర పాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డి.తిరుపతిరెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన గత కొన్నేళ్లుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సాంఘికశాస్త్ర సబ్జెక్టును బోధించడం లేదని అందిన ఫిర్యాదులపై ఎంఈవోతో విచారణ జరిపించిన డీఈవో రేణుక సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

సీఐ, వైద్యునిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం సంఘ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై దౌర్జన్యం చేసిన పొన్నూరు టౌన్ పీఎస్ సీఐ రవికిరణ్, వైద్యుడు ఫిరోజ్‌ఖాన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎస్ఐ రాజకుమార్‌పై రిజిస్టర్ అయిన కేసులో సరైన సెక్షన్లు నమోదు చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. సీఐ, ఎస్ఐ, వైద్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లాలోని అన్ని కోర్టులు బహిష్కరణ చేయాలని, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కార్యదర్శి అనురాధ, కోశాధికారి దాసు పాల్గొన్నారు.

8 నుంచి డైట్‌లో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్ ప్రత్తిపాడు మండలం బోయపాలెంలోని జిల్లా వృత్తి విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో ఈనెల 8న రంగోత్సవ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని విద్యాసంస్థల్లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్విజ్, స్వాతంత్ర సమరయోధుల చిత్రలేఖనం, చేతిరాత, ఐదుగురు సభ్యులతో కూడిన రంగోలి, జానపద నృత్యం, డిజిటల్ కొలేజ్ (యూనిటీ, సమైక్యత పోస్టర్), స్లోగన్ రైటింగ్ (ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్), రోల్ ప్లే (భారత సంస్కృతి, చరిత్రకు సంబంధించిన అంశాలు)పై పోటీలు ఉంటాయని వివరించారు. గతేడాది జరిగిన రంగోత్సవ్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు అనర్హులని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులు అవసరమైన సామగ్రి వారే తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి కళా రూపానికి ఐదు నిమిషాలు సమయం ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు డైట్ అధ్యాపకులు పి.పోలేరు, డాక్టర్ కె.ప్రసాద్‌ను 97047 90917, 80192 07528 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. డైట్‌బోయపాలెంగుంటూరు ఎట్ దరేట్ జీమెయిల్‌కు వివరాలు పంపాలని తెలిపారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్



రికార్డులను పరిశీలిస్తున్న ఎం.ఎ.షరీఫ్ చిత్రంలో ఎమ్మెల్యే నసీర్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారులు అహ్మద్ షరీఫ్ చెప్పారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని, సంగడిగుంటలోని మైనారిటీ బాలిక గురుకుల పాఠశాలను సోమవారం ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఎ షరీఫ్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ సందర్శించారు. ముందుగా మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఉర్దూ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. వాటికి సొంత భవనాలు, ఆట స్థలాలను సమకూర్చాలని కృషి చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో మైనార్టీ ఐటీఐ, పాలిటెక్నిక్, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మైనారిటీల విద్యకు సర్కారు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.